క్లుప్తంగా

కార్మికుల డిమాండ్లపై స్పందించాలి



మండపేటలో మున్సిపల్ కార్మికులకు మద్దతు పలుకుతున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

కపిలేశ్వరపురం (మండపేట): మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల డిమాండ్లపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గ రాణి కోరారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన శిబిరాన్ని సోమవారం చైర్‌పర్సన్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రతి నిత్యం పట్టణ ప్రజల మౌళిక అవసరాలను తీర్చుతున్న కార్మికుల వేతనాలను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కౌన్సిలర్లు నీలం దుర్గ, మొండి భవాని, మందపల్లి రవి కుమార్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కొప్పిరెడ్డి పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎరగ్రుంట అయ్యప్ప, శెట్టి నాగేశ్వరరావు, జొన్నపల్లి సత్తిబాబు మాట్లాడుతూ కార్మికుల డిమాండ్ల పరిష్కారమయ్యే వరకూ తమ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

సమాజ ఉన్నతికి దోహదం

కపిలేశ్వరపురం: విద్యావేత్త, సాహితీవేత్త కాకినాడకు చెందిన చిరంజీవినీ కుమారి కృషి సమాజ ఉన్నతికి విశేషంగా దోహదపడుతుందని మండపేటకు చెందిన సాహితీ సంగమం సంస్థ నిర్వాహకులు డాక్టర్ చల్లా రవికుమార్, డా.మెహర్‌ప్రసన్న అన్నారు. సోమవారం ఆమె మృతికి సంతాపం ప్రకటిస్తూ, ప్రగతిశీల, సాహితీ ఉద్యమాలకు తీరని లోటని తెలిపారు. సుదీర్ఘకాలం ఆమె కృషితో ఎందరో అభ్యుదయ భావాలుగల వ్యక్తులు, సంఘాలు ఉత్తేజంగా ముందుకు సాగాయన్నారు. శాస్త్రీయ విద్య అభివృద్ధికై చివరి వరకూ శ్రమించిన ప్రజ్ఞాశీలి అని కొనియాడారు. సైన్స్ శాస్త్రీయ భావజాలం వ్యాప్తికి విశేష కృషి చేయడంతోనే ఆమెకు నిజమైన నివాళులర్పించినట్లని డా.రవికుమార్, డా.మెహర్‌ప్రసన్న అన్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నల్లూరు గ్రామానికి సంబంధించి లైన్లకు సోమవారం మరమ్మతులు చేశారు. రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు పర్యవేక్షణలో సబ్‌స్టేషన్ ఏఈ సత్యనారాయణ ఆధ్వర్యంలో రాబోవు వర్ష కాలన్ని దృష్టిలో ఉంచుకుని సిబ్బంది లైన్లను సరిచేశారు. చెట్టుకొమ్మలను తొలగించి అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

రోగులకు పండ్ల పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని మాధవి ఎడిబుల్ ఆయిల్స్ అధినేత వేగుళ్ల మాధవిబాబు పుట్టినరోజు సందర్భంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలను అందజేశారు. ఈ సేవా కార్యక్రమంలో కౌన్సిలర్లు నీలం దుర్గ, మొండి భవాని, మందపల్లి రవి కుమార్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కొప్పిరెడ్డి పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎరగ్రుంట అయ్యప్ప, శెట్టి నాగేశ్వరరావు, జొన్నపల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయ భూముల వేలం పాట ఖరారు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాటలు జరిగాయి. వేగాయమ్మపేట, వెలంపాలెం, చోడవరం గ్రామాల్లోని 17.46 ఎకరాల వ్యవసాయ భూములకు సంబంధించి మూడు సంవత్సరాల కాల పరిమితికిగాను రూ.5,94,750 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. గతంలో శిస్తు రూ.5,74,000 కాగా ప్రస్తుతం అధికంగా వచ్చినట్లు తెలిపారు. అదే విధంగా కోటిపల్లి రోడ్‌లోని కల్యాణ వేదిక వద్ద డెకరేషన్ల నిమిత్తం గతంలో రూ.6,07,200 కాగా, ప్రస్తుతం రూ.6,20,000కు, భీమేశ్వరస్వామి ఆలయంలో వివాహ కల్యాణ మండపాలు వేసుకునే హక్కుకు సంబంధించి గతంలో సంవత్సరానికి రూ.13,00,000లు కాగా, ఈ ఏడాది 18,05,000లకు పాట ఖరారు అయినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్. బాలాజీ రాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ద్రాక్షారామలో ఫ్లెక్సీ రగడ

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గానికి నడిబొడ్డుగా ఉన్న ద్రాక్షారామలో సోమవారం ఫ్లెక్సీ రగడ చోటు చేసుకుంది. వైఎస్సార్ సీపీ అధినాయకత్వం పిలుపు మేరకు ఈ నెల 4న నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' ఫ్లెక్సీని ద్రాక్షారామ బోసుబొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేయగా దానిని సర్పంచ్ సూచనల మేరకు పంచాయతీ సిబ్బంది తొలగించారు. దీనిపై వైఎస్సార్ సీపీ శ్రేణులు మండిపడుతున్నారు. ఏప్రిల్ 20న ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుట్టిన రోజు ఫ్లెక్సీలు ఇప్పటికీ బోసుబొమ్మ సెంటర్‌లో అలాగే ఉండగా ఒక్క వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీనే తీసివేయడం సమంజసం కాదని హితవు పలుకుతున్నారు.

వర్షాకాలం.. అనువైన సమయం

- వైఎస్సార్ సీపీ పాలనలో 'జగనన్న పచ్చతోరణం'
- చెరువుగట్ల పటిష్టతకు కేంద్రం చొరవ
- వృక్ష ప్రాధాన్యతను చెప్పే ఆధ్యాత్మిక అంశాలెన్నో..



వెదురుమూడి-కాలేరు రహదారిలో గుబురుగా పెరిగిన చెట్లు



పడమర ఖండ్రికలో రహదారి వెంబడి ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో నాటిన మొక్కలు

కపిలేశ్వరపురం: చెట్టు నీడ మాత్రమే ఇచ్చేది కాదు.. ఆక్సిజన్ ఆధారిత ప్రాణులన్నింటికీ ప్రాణధాత. పురాతన కాలంలో చెట్టుకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఆధ్యాత్మిక అంశాల్లో సైతం ప్రస్తావించారు. భయంతోనో భక్తితోనో చెట్లను సంరక్షించేలా మనుషులను చైతన్యపర్చారు. ఆధునికత పేరుతో ప్రస్తుత కాలం ఎంత మారినా మనిషికి కావాల్సిందే ఆక్సిజన్. అది ఇచ్చేది చెట్టే. వృక్షాలకు అంకుర కాలంగా వానాకాలాన్ని పరిగణిస్తారు. మొక్కను నాటితే సహజసిద్ధంగా కురిసే వర్షం ద్వారా నీటిని స్వీకరించుకుని తనకు తాను చెట్టు వృద్ధి చెందగలుగుతుంది. ఇతర కాలాల్లో మొక్కను నాటడంతో పాటు నీరును పోయడానికీ శ్రమించాల్సి వస్తుంది. జూన్ నెలలో వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో వృక్ష సంపద పరిరక్షణకై ఈ ప్రత్యే కథనం.

పర్యావరణానికి విఘాతమిలా...

మానవ సమాజం పర్యావరణానికి అనేక రకాలుగా విఘాతం కల్పిస్తుంది. అరటి ఆకు స్థానంలో పేపర్ ప్లేట్, స్టీల్ క్యాన్ల స్థానంలో పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ డబ్బాలు వచ్చాయి. ఒక పెళ్లి జరిగిన చోట కుప్పలు తెప్పలుగా వ్యర్థాలు పోగుపడుతున్నాయి. సౌకర్యం కోసమంటూ ఉత్పత్తి చేస్తున్న ప్లాస్టిక్ సరుకులు పర్యావరణానికి విఘాతం కల్పించే వ్యర్థాలుగా మారుతున్నాయి. వర్షపునీరు భూమిలోకి ఇంకే మార్గాలు మూసుకుపోతుండటంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఇలాంటి సమస్యలకు తోడు వర్షాభావం ఏర్పడితే మానవాళి మరింత సతమతమైపోతుంది. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఉపకరిస్తుంది.

రెండు నియోజకవర్గాల్లో వ్యర్థాల ఉత్పత్తి ఇలా...

మండలం	కుటుంబాల సంఖ్య	వ్యర్థాల ఉత్పత్తి (టన్నుల్లో)
కపిలేశ్వరం	23,349	5,600
రాయవరం	23,867	5,900
మండపేట	42,515	10,200
ఆర్సీపురం	41,003	9,300
కె.గంగవరం	22,842	4,400
మొత్తం	1,53,576	35,400

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలిలా...

వృక్ష సంరక్షణ కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరివిగా చేపడుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో జగనన్న పచ్చతోరణం పేరుతో ప్రభుత్వ ఖాళీ స్థలాలు, రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టింది. అమృత సరోవర్ ట్యాంక్ పేరుతో చెరువు గట్లు అభివృద్ధికై కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుంది. అందుకోసం నిధులను కేటాయించి మొక్కలను సరఫరా చేస్తుంది. 2023లో జిల్లాకు 75 అమృత సరోవర్ చెరువురు మంజూరయ్యాయి. వాటిలో మండలానికి ఒకటి చొప్పున మంజూరు చేశారు. ఇప్పటికే చెరువు గట్లును పటిష్టపరచి కొబ్బరి మొక్కలను నాటారు. సందర్శకులు కూర్చునే విధంగా సిమ్మెంట్ కుర్చీలను ఏర్పాటు చేశారు.

మొక్కల పెంపకం ఇలా...

కపిలేశ్వరపురం మండలంలో 2021లో 2.40 కిలోమీటర్లు మేర నాలుగు ప్రదేశాల్లో 961 మొక్కలను నాటారు. 2022లో నిడసనమెట్టలో 200 మొక్కలను నాటారు. నేలటూరులోని అమృతసరోవర్ చెరువు గట్లుపై 50 కొబ్బరిమొక్కలను నాటారు. రాయవరం మండలంలో 2021లో 9.26 కిలోమీటర్లు విస్తీర్ణంలో 12 ప్రదేశాల్లో 3,705 మొక్కలు నాటారు. 2022 కురకాళ్లపల్లి, వెంటూరు, నదురుబాద, వి.సావరం గ్రామాల్లో 1,140 కొబ్బరి మొక్కలను నాటారు. అమృత సరోవర్ చెరువుగా వెంటురు చిన్న చెరువును ఎంపిక చేసి 150 కొబ్బరి మొక్కలను నాటారు. రామచంద్రపురం మండలంలో 2021లో 18.23 కిలోమీటర్లు మేర 27 ప్రదేశాల్లో 7,290 మొక్కలు నాటారు. మాలపాడు చెరువును అమృత సరోవర్ చెరువు పేరుతో 100 కొబ్బరి మొక్కలను నాటారు. కె.గంగవరం మండలంలో 8.25 కిలోమీటర్లు మేర 20 ప్రదేశాల్లో 3,300 మొక్కలను నాటారు. దంగేరులో 100, యండగండిలో 160 మొక్కలను నాటారు. కాజులూరు మండలంలో 4.15 కిలోమీటర్లు మేర 8 ప్రదేశాల్లో 1,660 మొక్కలను నాటారు. మండపేట మండలంలో 2021లో 11.50 కిలోమీటర్లు మేర 12 ప్రదేశాల్లో 4,600 మొక్కలను నాటారు.

ఒక్క మొక్కనైనా నాటుదాం



ఆధునికత పేరుతో చెట్లను నరికేయడం సరికాదు. ప్రకృతికి విరుద్ధ చర్యలు జరిగిన కాలాల్లో అనేక జీవరాశులు మరుగునపడిపోయాయి. పర్యావరణ పరిరక్షణ ప్రతి మనిషి బాధ్యత. వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించి ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటడం మేలు కలుగుతుంది.

టీవీ గోవిందరావు, న్యాయవాది, ఏడిద

ఆధ్యాత్మిక అంశాలెన్నో

వృక్ష సంపద ప్రాధాన్యతను తెలియజెప్పేందుకు ఆధ్యాత్మిక అంశాలెన్నో ఉన్నాయి. నక్షత్రం, గ్రహాలు, ఋషులకు ఒక్కో మొక్క నిర్ధారించినట్టు ఆధ్మాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. బుధ గ్రహానికి ఉత్తరేణి, శుక్ర గ్రహానికి మేణి, చంద్రకు మోదుగ, గురువుకు రావి, రవికి జిల్లేడు, కుజకు చంద్ర, కేతుకు దర్భ, శనికి జమ్మి, రాహువుకు గరిక వృక్షాలను పూజిస్తారు. కశ్యప ఋషికి ప్రతిగా తులసి, అత్రి ఋషికి అవిశ, భరద్వాజకు ఉత్తరేణి, విశ్వామిత్రకు మారేడు, గౌతమికి తెల్ల ఉమ్మెత్త, జమదగ్ని గరిక, వశిష్ఠ ఋషికి జమ్మి వృక్షాన్ని పూజిస్తారు. ఇలా ఒక్కో నక్షత్రానికి ఒక్కో వృక్షాన్ని పూజిస్తారు.

దగా పాలనకు గుర్తు వెన్నుపోటు దినం

- కూటమి అరాచక పాలక సాగిస్తుంది
- అమలు కాని హామీలిచ్చి వంచించారు
- ఏడాది పాలనకు గుర్తుగా 'వెన్నుపోటు దినం'
- పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ తోట



'వెన్నుపోటు దినం' పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



రామచంద్రపురంలో వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రాయవరం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, అరాచక పాలనపై ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు రానున్నాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పసలపూడి చింతా సుబ్బారాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ సమావేశపు హాలులో సోమవారం రాయవరం మండలం వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ తమలంపూడి గంగాధరరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అని, అమలు కాని హామీలు ఇచ్చారని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా హామీలు అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రజలను వంచించి, మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అరాచక పాలన, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు, హామీలు ఎగ్గొట్టిన వైనాన్ని ఎండగడుతూ ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందుకే జూన్ 4న చంద్రబాబునాయుడు వెన్నులో వణుకు వచ్చేలా 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలన్నారు. మండపేట పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సర్పంచ్ కడలి పద్మావతి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, మండపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, పోతంశెట్టి సత్య స్వరూపరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆందోళనను విజయవంతం చేయండి

కపిలేశ్వరపురం (మండపేట): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరిస్తూ ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి సంవత్సరం పాలనను వ్యతిరేకిస్తూ రేపు నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండపేట రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు కోరారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని తేదీలను ప్రకటించి మరీ అమలు చేసిన ఘనత అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదన్నారు. ప్రస్తుత కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏడాది పాలనా కాలంలోనే ఒక్కొక్కటికీ విస్మరిస్తున్నారన్నారు. ప్రజలు చైతన్యంతో కూటమి దౌర్జన్యాలపై రేపటి ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని వీరబాబు పిలుపునిచ్చారు.

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

రామచంద్రపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం పోస్టర్‌ను నియోజకవర్గ కోఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ పట్టణంలోని గాంధీపేటలోని పార్టీ కార్యాలయం వద్ద సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకుఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ఏడాది పాటు పాలన సాగించిన కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని, అందుకోసం ఈనెల 4న చేపట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి ప్రజలు కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈనెల 4న పట్టణంలోని గాంధీపేటలో పార్టీ కార్యలయం వద్ద వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం చేపడతామని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వంచనపై ఉద్యమిద్దాం

కాజులూరు: కూటమి పాలన నయవంచనకు నిరసనగా ఈ నెల నాలగో తేదీ బుధవారం వైఎస్సార్ సీపీ నిర్వహించ తలపెట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు మండల గ్రామాల్లో పర్యటించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా పార్టీ అభిమానులు, ప్రజలను ఆహ్వానించారు. కాజులూరులో ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పేరుతో ఎన్నికల్లో ఎన్నో తప్పుడు వాగ్దానాలు చేసిన కూటమి నేతలు ఏ ఒక్కటి పూర్తిగా అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. పథకాల అమలుపై ప్రజావ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు 'రెడ్‌బుక్' పేరుతో వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి సోషల్‌మీడియా ద్వారా హడావుడి చేస్తుందన్నారు. కూటమి నయవంచన పాలనకు ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా పార్టీ 'వెన్నుపోటు దినం' నిర్వహించనుందన్నారు. కార్యక్రమానికి మండల గ్రామాలకు చెందిన పార్టీ కార్యాకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు



సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు



'వెన్నుపోటు దినం' విజయవంతం చేయాలని కోరుతూ పర్యటిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



జి.శ్రీనివాస్

కపిలేశ్వరపురం: మండల తహసీల్దార్‌గా మండపేట మండలం డిప్యూటీ తహసీల్దార్ జి.శ్రీనివాస్‌ను ప్రభుత్వం నియమిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఎఫ్‌ఏసీగా బాధ్యతలను స్వీకరించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన చిన్నారావు ఉద్యోగ విరమణ పొందారు.

యోగా శిక్షణ కార్యక్రమాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలోను, ఎంపీడీవో కార్యాలయంలోను సోమవారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి విలేకరులకు తెలిపారు. అదే విధంగా యోగాంధ్ర 2025లో భాగంగా 21 సచివాలయాల పరిధిలోని గ్రామ స్థాయి యోగా కాంపిటీషన్ 10 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగిన వారికి జూనియర్స్, సీనియర్స్ విభాగాల వారీగా గెలుపొందిన వారికి మండల స్థాయిలో యోగా, మెడిటేషన్, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ఆసనాలు, రంగోలి పోటీలను మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించామన్నారు.

ఉపాధి కూలీ మృతి

కాజులూరు: మండలంలోని ఉప్పుమిల్లిలో సోమవారం ఉపాధి పనిచేస్తూ వినకోటి వెంకటరావు (62) మృతి చెందాడు. ఈ సంఘటనకు స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. ఉదయం వెంకటరావు తన తోటి కూలీలతో కలసి గ్రామంలో ఉపాధి పనికి వెళ్లాడు. తుప్పలు తొలగిస్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలాడు. తోటి కూలీలు గమనించి హుటాహుటిన గ్రామంలోని ఒక ప్రైవేటు వైద్యునికి చూపించగా అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యుడు ధ్రువీకరించారు. గుండెపోటుకు గురై వెంకటరావు మృతి చెంది ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు.

కూలిన వాటర్ ఓవర్‌హెడ్ ట్యాంక్ డోమ్

- నిలిచిన తాగునీటి సరఫరా
- పరిస్థితిని సమీక్షించిన ఉన్నతాధికారులు



మండపేటలో దెబ్బతిన్న ఓవర్ హెడ్ ట్యాంక్



ట్యాంక్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ ఇంజనీర్, చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని బురుగుంట చెరువు పార్కు వద్దగల వాటర్ ఓవర్ హెడ్ ట్యాంక్‌లో నీరు నిలిచే భాగంలోకి ట్యాంక్ పై భాగం డోమ్‌లో కొంత భాగం కూలిపోయింది. శిథిలభాగాలు నీటిలో పడటంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. 3.25 లక్షల గ్యాలన్లు సామర్థ్యం గల ట్యాంక్ స్లాబ్ క్రమంగా పెచ్చులూడి శిథిలావస్థకు చేరింది. పట్టణ వాసులు నీటి సరఫరా లేక తీవ్ర అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న రాజమండ్రి సర్కిల్ పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు, జిల్లా డీపీహెచ్ఓ హుస్సేన్ ఘటనా స్థలానికి వచ్చి ట్యాంక్‌ను పరిశీలించారు. శిథిల భాగాలను తొలగించి మరమ్మతు పనులను చేసేందుకు అంచనా వేసే ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. నీటి సరఫరాను పునరుద్ధరించే మార్గాలను అన్వేషించడంలో భాగంగా చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కమిషనర్ టీవీ రంగారావులతో చర్చించారు. వాటర్ ట్యాంక్ పరిధిలోని నివాసితులకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని, యుద్ధ ప్రాతిపదికన వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులను చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరణపై చొరవ చూపాలని మున్సిపల్ అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసరావు, ఏఈ ఆంజనేయులు, పవన్, కౌన్సిలర్లు నీలం దుర్గ, మొండి భవాని, మందపల్లి రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు శెట్టి నాగేశ్వరరావు, జొన్నపల్లి సత్తిబాబు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలకి ప్రహరీ నిర్మించాలి



ఆర్డీవో అఖిలకు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రామచంద్రపురం: మండపేట మండలం కేశవరం గ్రామంలో 30 ఏళ్లుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో ఆక్రమణలకు గురవుతుందని, ఆకతాయిలు స్కూల్ ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు పాల్పడుతున్నారని ప్రభుత్వం వెంటనే పాఠశాలకు ప్రహరీని నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ నాయకులు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో డి.అఖిలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి సాయిరాం పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఆక్రమణకు గురయిన స్థలాన్ని పాఠశాలకి అప్పజెప్పి ప్రహరీ నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశామన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యార్థులకు తాగునీటి సదుపాయం గదులలో లైట్లు, ఫ్యాన్లు విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. విద్యార్థులకు ట్రంకు పెట్టెలు, పుస్తకాలు, బట్టలు సకాలంలో అందించాలని గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా హాస్టల్లో ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్ , అటెండర్ పోస్టులు భర్తీ చేయాలని వినతి పత్రం అందజేశామన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో 5 అర్జీలు

రెవెన్యూ డివిజినల్ అధికారి వారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో మొత్తం 5 అర్జీలు వచ్చినట్లు కార్యాలయ అధికారులు వెల్లడించారు. ఆక్రమణ తొలగించాలని ఒకటి, రీ సర్వే తప్పులు సరిచేయాలని ఒకటి భూమి స్వభావం మార్పు చేయాలని ఒకటి, కిట్స్ ఇంజినీరింగ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని దరఖాస్తులు సమర్పించినట్లు పేర్కొన్నారు.

పేదలందరికీ గృహ వసతి కల్పించాలంటూ ధర్నా



డీటీ మాధురికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు, లబ్ధిదారులు

రామచంద్రపురం రూరల్: అర్హులైన పేదలందరికీ గృహ వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డీటీ మాధురికి వినతి పత్రం అందజేశారు. సీపీఐ కార్యదర్శి పెద్ది రాము మాట్లాడుతూ అర్హులైన పేదలకు పట్టణాలలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు అందించాలన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల పట్టాల భూముల్లో గృహ నిర్మాణాలకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పాఠశాలలు తదితర మౌలిక సదుపాయాలన్నీ కల్పించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో మంజూరు చేసిన టిడ్కో గృహాలు నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. జగనన్న కాలనీల్లో రేషన్ డిపోలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్.శారదాదేవి, వేమవరపు రాంబాబు, ర్యాలి సత్తిబాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

శ్రీరామనామ సప్త సప్తాహం ప్రారంభం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం ప్రసన్నాంజనేయ బాల భక్త సమాజం ఆధ్వర్యంలో 49 రోజుల పాటు నిర్వహించనున్న శ్రీరామనామ సప్త సప్తాహం ఘనంగా ప్రారంభించారు. ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీను దంపతులు, కొమ్మిశెట్టి భీమశంకరం, రామలక్ష్మి దంపతులు, కొమ్మిశెట్టి వేణుగోపాల్, శైలజ దంపతుల చేతుల మీదుగా కలశ స్థాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలు భజన బృందాలు భక్తి గీతాలు ఆలపించారు.

అప్రమత్తంగా ఉండాలి

రామచంద్రపురం: వర్షాకాలం ప్రారంభం కావటంతో మలేరియా, డెంగీ వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరీష్ అన్నారు. పట్టణంలో కోట హరిజన పేట, అర్బన్ పీహెచ్‌సీ వద్ద మలేరియా నివారణ మాసోత్సవాల ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ ఒకటో తేదీ నుంచి 30 తేదీ వరకు మలేరియా, దోమల ద్వారా సంభవించే డెంగీ, ఫైలేరియా వంటి వ్యాధులు సంభవించకుండా తీసుకునే చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఏ ప్రాంతంలో ఈ వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయో అక్కడ ముందుగానే పారిశుధ్య కార్యక్రమాలు, అవగాహన సదస్సు చేపట్టడం వలన వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చన్నారు. డాక్టర్ హేమ సుధీర్ మాట్లాడుతూ మలేరియా, డెంగీ వంటి వ్యాధుల అంతం మన చేతుల్లో ఉందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత చేపట్టాలని సూచించారు. డివిజన్ సూపర్వైజర్ జి.కమల్ శేషు మాట్లాడుతూ మలేరియా, డెంగీ వంటి వ్యాధులను గుర్తించుటకు అర్బన్, రూరల్ పీహెచ్‌సీల్లో టెస్టింగ్ కిట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు.